


మొదట పెండ్లి



తరవాత ప్రాయశ్చిత్తం!

ఇంకముందు శారదాచట్టం మరీ చిక్కగా పరిణమిస్తుంది, యింక తప్పించుకొనడానికి వీలులేదని తెలిసి,–యెదిగిన తరవాతనే పిల్లలకు వివాహంచేయడానికి స్థిరపరచుకొన్న ఛాందసులు "అనార్యపద్ధతి" వివాహాలకుగాను– పెళ్ళికొడుకులు, ప్రాయశ్చిత్తం చేసికొంటేసరి అని తృప్తిపడబోతూవున్నారు! అందుకే బాగా కోద్దీ బైతో అన్నారు!

# తిరుగుళ్లు – తికమకలు

BOOKS
MADRAS

(జి. ఎన్. సూరి. బి ఎ. బి ఎల్.)

మొన్న యీమధ్య మావూరికి శ్రీ షడ్రసోపేత పంచ భక్ష్య పరమాన్నభోజన పీఠాధిపతియగు శ్రీశ్రీశ్రీ ఉదరానందస్వాములవారు వేంచేశారు. వీరు రాకమునుపే వీరిపేరు ప్రఖ్యాతులు మాకు తెలియవచ్చినవి. వీరు వేదవేదాంగ పారీణులని, శ్రీ విఘ్నేశ్వరోపాసకులని, భూత భవిష్యత్ వర్తమానములు తెలిసినవారని, ప్రాపంచక విజ్ఞాన సంపన్నులని వినవచ్చిన ప్రతీతినిబట్టి ఆయనను చూడటానికి మావూరి జనమంతా గుంపులుగా వెళ్ళి వచ్చారు. ఇంతగా చెప్పుకొంటున్నారే ఏమి శలవిస్తారో విందామని ఒకరోజున వారిని దర్శించటానికి నేనూ వెళ్ళాను.

సాయంత్రం ఆరుగంటలవుతుంది. స్వామి ఉదరానందులు అప్పుడే వారి ఇష్టదైవాన్ని ఆరాధించి, ఆవరణంలో వున్న ఒక వేపచెట్టుక్రింద ఉపవేష్టులై, చుట్టూ శిష్యబృందాన్ని కూర్చోపెట్టుకొని, దేవతలందరిలోను విఘ్నేశ్వరునికిగల గొప్పతనం మీద గంభీరోపన్యాసం చేశారు. నేను కొంచెం దూరంగా కూర్చుని ఉంటాన, ఈ వుపన్యాసం పూర్తిగా వినబడలేదు. కాని ఆయనవంక తదేకదృష్టితో చూస్తూ కూచున్నాను. ఆయన ఎలా వున్నాడనుకొన్నారు? శ్రీవారి తల తెల్లగా నున్నగా పాలగచ్చుమాదిరి మెరిసి పడిపోతున్నది. కళ్ళు తెరిపిడిపడీపడకుండా సగం మూసుకొని నిమీలితంగా వున్నవి. దవడలు, గడ్డం, నోరు మసోలిని వ్యంగ చిత్రానికి వున్నట్లు వున్నవి. ఆయనకు మెడ అనే పదార్థం వున్నట్లు నాకేమీ కనబడలేదు. గడ్డానికి ఆనుకొనే ఉదరం బయలుదేరి కొన్నిమైళ్ళు గుండ్రంగా వెళ్ళి తిరిగివచ్చింది. దూరానికి చూస్తే ఆయన, ఒక పెద్ద చాకిబానమీద ఒకచిన్నపిడత బోర్లించినట్లు కన

బడ్డాడు. పైగా వంటినిండా దట్టంగా కంబళిపెరిగి ఆంధ్ర సోమపితామహుణ్ణి మరపించేట్లు వున్నది.

కొంతసేపు నేనట్లా కూర్చున్న తరువాత నావంక తీక్షణంగా ఒకసారిచూచి తల అవతలకు తిప్పాడు. మౌనంగా కూచుంటే లాభంలేదని ఆయన ఎదుటికి వెళ్ళి సాష్టాంగపడి, "ఉదరానందస్వామీ! నే చేసిననేరం ఏమిటి?" అన్నాను.

"నీవు నేరంచేశావని ఎవరన్నారోయ్? నీవు ఎవరివీ, ఎందుకువచ్చావూ అని ఆలోచిస్తున్నాను. సరే ఇప్పటికి తెలిసింది. మా ఇలవేల్పయిన చిరు బొజ్జగణపయ్యకు తండ్రివున్నాడే మహేశ్వరుడు ఆయనతో మార్కండేయుల వ్యవహారంలో విరోధంపెట్టుకొన్న యమధర్మరాజు గుమాస్తా అయిన 'చిత్రగుప్త'ని విలేఖరివి కావుటోయి నీవు? నీ పుట్టెండా వెధవ ధర్మసందేహాలు పెట్టుకొని దయచేశావు కానియ్. అడగదలచిందేదో అనుగు త్వరత్వరగా. ఒక గంటలో నేను ఉదరపూజకు బోవాలి; కాని ఒక సంగతి మటుకు జ్ఞాపకంఉంచుకో, నేను అన్నది అన్నట్లుగాకుండా, కలిపించివ్రాశావా, నీ వీపు పగిలిందన్నమాటే."

ఇదంతా వినేప్పటికి నాకు ఆశ్చర్యంవేసింది. నేను చెప్పకుండానే అంతా కనుక్కొన్నాడు; స్వామి అంటే ఉదరానందస్వామే అనుకున్నాను.

"స్వామిజీ" అని మొదలుపెట్టాను.

"ఏమిటి హిందీలో గొణుగుతున్నట్లున్నావు? నీ ముఖానికి తెలుగులో ఏడిస్తే చాలులే" అన్నాడు. ముందు వేదాంత చర్చకు దిగాము.

"అయితే స్వాములవారూ! ఈ సృష్టికి కారణం ఎవరంటారు?"

"అబ్బో పెద్ద సమస్యే, ఎవరంటావా? ఆకారం లేక, గుణంలేక, మొదలు చివరా లేక, ఉండి లేకుండా వున్నాడే ఆ భగవంతుడు, ఆయనే ఈ సృష్టికి కారణం అని మన వేదప్రమాణం."

"అయ్యా ఆ భగవంతుడికి ఈ ప్రపంచమంతా సృష్టించాలనే దుర్బుద్ధి ఎందుకుపుట్టింది స్వామీ?"

"దానికి కారణం నాకు పూర్వులైన ఋషులంతా 'భగవంతుని ఇచ్ఛ, లీల, మాయ' అని సమాధానంచెప్పారు. ఇది అర్థంలేని జవాబు. సమంజసంగా వుండే సమాధానం చెప్పలేక ఈసులభమైన జవాబు చెప్పారు. నా తపోబలంవల్ల నేను తెలుసుకొన్న దేమిటంటే, భగవంతుడు సృష్టించడానికి కారణం నీబోటి చచ్చుపెద్దమ్మలు ఇటువంటి చచ్చు ప్రశ్నలు వేయటానికి తెలిసిందా సంగతి?"

"చిత్తం చిత్తం. అయితే ఆ భగవంతుణ్ణి నా బోటివాళ్ళు చూచేందుకు ఏదైన మార్గంవున్నదా స్వామీ?"


"లేకేమిరా? మీ భగద్గీతలోనే వున్నది. భగవదాంశ సంభూతుడైన కృష్ణుడేమన్నాడు? "ఎప్పుడు ప్రపంచంలో అధర్మం పెరిగిపోతుందో అప్పుడు ధర్మ సంస్థాపనార్థం అవతరిస్తా న"న్నాడు. కాబట్టి మీరంతా ఎంత అధర్మం ఎంత తొందరలో చేయగలిగితే అంత త్వరలో భగవంతుణ్ణి చూడవచ్చు. నీవు దేవుడి దగ్గరకు వెళ్ళకుండానే నీదగ్గరకు దేవుడు వస్తాడు. అప్పుడు నీవు తనివితీర చూతువు గాని."

"స్వామీ, మీ భృత్యుడికి ఇంత సులభమార్గం ప్రసాదించినందులకు ఎంతో కృతజ్ఞుడిని. అయితే తాము శ్రీ కృష్ణుడు భగవంతుడంటిరే దానిని ఎట్లా సమర్థిస్తారు?"


"ఎట్లాగా,- చెపుతావిను. నీ బుద్ధికి నీవే ఆలోచించుకొని చెప్పు. ఏ మనుష్యమాత్రుడైనా పదహారువేల భార్యలకు భర్తగా ఉండగలడటరా? ఇంత మందికి భర్తకాగలవాడు భగవంతుడు గాక ఇంకెవరురా మూఢా?"

"చిత్తం. అయితే ఉదరానందులవారూ, మన దేశంలో శివుడికి విష్ణువుకు ఇన్ని దేవాలయాలున్నవే బ్రహ్మదేవుడికి గుడే కనబడదేమి స్వామి?"

"ఈ మాత్రం తెలుసుకోలేక పోయినావు ప్రపంచంలో నీవెందుకు పనికివస్తావోయ్? అయితే విను: మనదేశం మొత్తం మీద శివుడికి దేవాలయాలు హెచ్చుగా కనబడుతవి. దానికి ఒకటే కారణం: త్రిమూర్తులలో సంహారము శివుడికెత్తినపడింది. కాబట్టి ఈ మారకుడైన శివుడికి ఎదో ఇంత కొంపగట్టి, అభిషేకాలతో తల చల్లబరుస్తూ, నైవేద్యాలతో పొట్ట నింపుతూవుంటే నాలుగు రోజులపాటు ఎక్కువ బ్రతుకనిస్తాడేమోనని శివాలయాలు కట్టినేశారు. ఇక విష్ణు



మొట మొదట చీనాను విడువకుండా తిరిమి ధ్వంసంచేసిన జపానువారు,



యీనాడు చీనా విజృంభణకు అగలేక పోలో మంటూ తిరిగి పరుగెత్తుతూవున్నారు.

పుకు కట్టడానికి కారణం ఆయన పోషించేవాడుకాబట్టి! అట్లా కట్టకపోతే దినభత్యాలు ఆగిపోతవేమోనని భయం ఇక బ్రహ్మగొడవ ఎవరికి పట్టుతుంది? పుట్టించడంవరకే ఆయనపని. మేపనూలేదు; చంపనూలేదు. పైగా కొంచెం కష్టంతోచినప్పుడల్లా 'ఈపాడు బ్రహ్మనన్నెందుకు పుట్టించాడురా" అని తిట్టేవాళ్ళేగాని మెచ్చుకునేవాళ్లు లేరు. ఇటువంటి దేవుడిముఖం ఎవరుచూస్తారు? అందుననే బ్రహ్మగుడి ఎక్కడా కనబడదు."

"ఆహా ఏమి జ్ఞానోదయం! అయితే స్వామీ, దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకండీ?"

"ఎందుకా? మొదటికారణం తాపీ ధర్మారావుగారు ఒక పుస్తకం వ్రాయటానికి. ఇక అసలు కారణం చెపుతావిను, పూర్వం దేవాలయాలన్నిటిని ఈ బూతు బొమ్మలు లేకుండానే కట్టేవాళ్ళు, ఈవిషయం మహేంజదారో మొదలైన ప్రాచీన ప్రదేశాలుచూస్తే తెలుస్తుంది. దేవాలయాలు అట్లా వున్నప్పుడు జనం ఎక్కువగా వాటికి వెళ్ళేవాళ్ళుగారు, కేవలం పరమభక్తులు తప్ప. 1736వ సంవత్సరంలో అఖిలభారత దేశంలో వున్న గుడుల ధర్మకర్తలు, పూజారులు కాశీలో సమావేశమై జనాన్ని దేవాలయాలలోకి ఆకర్షించేది ఎట్లాగా అని ఆలోచించారు. చివరకు నీవంటి బుద్ధిమంతుడొకడు ఈ వుపాయం చెప్పాడు. కలియుగంలో జనానికి బూతు అంటే ఎక్కువ ఇష్టం. కాబట్టి గుళ్ళు, గోపురాలు, రథాలు బూతుబొమ్మలతో నింపి దేవాలయాలలో దేవదాసీలను ప్రవేశ పెట్టమన్నాడు పరీక్షకుగాను ముందుగా శ్రీ సంతానగోపాలస్వామి దేవాలయం అట్లాచేశారు. జనం విరుచుకు బడ్డారు. ఈ ఆచారమే దేశమంతా పాకిపోయింది. ఇది ఆబూతు బొమ్మల రహస్యం. అంతేగాని మీ ఆంధ్రవిశారదగార తర్జుమాపుస్తకం ప్రకారంగాదు"

"అయితే స్వామీ! గుడిలో గంట లెందుకండీ?"

"పిల్లలను లోపలికి రమ్మంటానికి బడిలోగంట వుంటుంది. అలాగే భక్తులని లోపలికి రమ్మంటానికి గుడిలో గంట వుంటుంది"

"అయ్యా ప్రపంచంలో దయ్యాలూ భూతాలు ఉన్నవంటారా?"

"అవును ఒక్కచోట మాత్రమే భూతవైద్యుల విభూతి పెట్టెలలో ఉంటవి దయ్యాలూ భూతాలూను"

"స్వామీ, మీదయవల్ల ఈ వేదాంత రహస్యాలన్నీ తెలుసుకోగలిగాను. ఇక ప్రాపంచిక విషయాలలో నా సందేహాలు దీర్చ ప్రార్థిస్తాను."

"నీ కిచ్చిన కాలం గడచిపోతున్నది. త్వరగా అడుగు"

"మాకు ఆంధ్రరాష్ట్రం వస్తే లాభసాటిగా ఉంటుందంటారా?"

"పిచ్చివాడా! మీకు లాభం ఉండదని తెలిస్తే మీ తమిళసోదరులు ఎప్పుడో మిమల్ని వదిలించుకొనేవాళ్ళు. తెలుగు జిల్లాలుపోతే వాళ్లకు మిగిలే రివెన్యూ

దేవుడి గుళ్ళమీదా, కాఫీ హోటళ్లమీదనే గాదు టోయ్"

"అయితే మాకు ఆ ధ్రరాష్ట్రం ఎప్పుడు వస్తుం దంటా?"

"ఎప్పుడా? రాయలసీము తెలుగువాళ్ళు అరవ సోదరులకూడి మోజు ఎప్పుడు పోగొట్టుకొంటే అప్పుడు వస్తుంది"

"స్వామీ! ఎందుచేతనండి కొందరు సనాతనులు వేశ్యవృత్తి వుండాలంటారు."

"దానికి మొదటికారణం ఈ వృత్తిలో ఉండే వాళ్లు సంఘంలో పుట్టే ఉద్రేకానికి బలిగావుంటే తక్కిన కుటుంబాలు సురక్షితంగా వుండవచ్చునుగాదా అని. రెండవకారణం చెడిపోయిన స్త్రీలకు శరణ్యంగా వుంటుంది కదా అని వాళ్ల వుద్దేశం"

"మనదేశంలో సోషలిస్టు తిరుగుబాటు ఎప్పుడు వస్తుంది స్వామీ?"

"చదువుకున్నవాళ్ళు ఎక్కువై ఉద్యోగాలు తక్కువకావాలి. కూలీలకు పనులు తగ్గి రైతులకు అప్పులు పెరగాలి. అప్పుడూ సోషలిజం వచ్చేది."

"మన జమిందారులు సోషలిస్టులుగా మారటానికి మార్గం చూపగలరా?"

"ఎలక్షనులే దానికి మార్గం; మొదటి ఎలక్షనులోని జమిందారు, రెండవ ఎలక్షనులో భూస్వామిఅయి మూడవ ఎలక్షనులో సోషలిస్టు అవుతాడు."

"హిందువులకు మహమ్మదీయులకు సఖ్యత ఎప్పుడు కుదురుతుంది?"

"తగాదాలు పెట్టేదుకు లేకుండా తెల్లవాళ్ళు మనదేశం విడవాలి; అప్పుడు పెనవేసుకుపోతవి హిందువుల పిలకలు, సాహేబుల గడ్డాలు."

"మాకు స్వరాజ్యం ఎప్పుడువస్తుంది స్వామీ?"

"ఆ సంగతి మీ గాంధీనిపోయి అడుగు."

"స్వామీ, దేశానికి మీ సందేశమేమైనా ఇస్తారా?"

"సరే విను. డాక్టరు పట్టాభిగారిని ఇన్సూన్స్ రెన్సు కంపెనీలు, జాయింటుస్టాకు కంపెనీల గొడవ వదలమని చెప్పు.

దేశభక్త కొండ వెకటప్పయ్యగారిని కోపం కొంచెం తగ్గించుకోమని చెప్పు

గొల్లపూడి సీతారామశాస్త్రిగారిని ముక్కు మూసుకుని చక్కంగా ఆశ్రమంలోనైనా ఉండమను, లేదా రాజకీయాలలోనైనా మునుగమను. ఉన్నవ లక్ష్మీనారాయణగారిని శారదానికేతనం వ్యవహారాలు లక్ష్మీబాయమ్మగారికి విడిచి, ఆంధ్రత్వం ఉట్టిపడేట్లు మాలపల్లివంటి మరికొన్ని పుస్తకాలను వ్రాయమని చెప్పు.

సి రాలగోపాలాచారిగారిని తక్కిన మంత్రులకుకూడా కొంచెం స్వేచ్ఛ ఇవ్వమనిచెప్పు. ప్రకాశం పంతులుగారిని మరి ఏ పత్రికను మళ్లా మొదలు పెట్టవద్దని చెప్పు.

సాంబమూర్తిగారితో వారికి ఇంకా ఇంగ్లాండు మీద మోజుపోకపోతే ఈ తడవ ఏ డాక్టరుచేతనో సముద్రయానం వీరి ఆరోగ్యానికి తక్షణం అవసరమని చెప్పించమను. నడింపల్లి నరసింహారావుగారిని గుంటూరు మునిసిపాలిటీ నాటకంలో యుగంధర పాత్రను చాకచక్యంగా ప్రదర్శించమని చెపుతూ కంట్రాక్టర్లను కట్టుబాట్లలో వుంచమను. కాశేశ్వరరావుగారిని బెజవాడ గొడవలలోనుంచి బయటికి రమ్మను."

"స్వామీ తెలుగుపత్రికలకు సందేశమేమీ ఇవ్వరా?"

"ఏ పత్రిక అయినా పడిపోయేట్టుగావుంటే బూతుకథలు, సినిమా బొమ్మలు వెదజల్లమని చెప్పు.

ఇక నీకిచ్చిన కాలం గడిచిపోయింది. వెనకకు తిరిగి చూడకుండా వెంటనే వెళ్లిపో" అన్నాడు.

లేచిపోకపోతే ఏమిచేస్తాడో అని స్వామీఉదరానందునికి ఒక్క నమస్కారంచేసి బయలుపడ్డాను.

